క్లుప్తంగా

పేదల వైద్యుడు అంజయ్య మృతి


డాక్టర్ అంజయ్య (ఫైల్)

నాగులుప్పలపాడు: ఏడు దశాబ్దాల పాటు పేదలకు వైద్య సేవలు అందించిన డాక్టర్ పత్తిపాటి అంజయ్య (97)సోమవారం మృతి చెందారు. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన అంజయ్య స్వాతంత్ర్యం పూర్వమే గ్రామంలో వైద్య వృత్తి మొదలుపెట్టి ఆర్ఎంపీగా సేవలందించారు. ఎంతో మంది పేదలకు సొంత ఖర్చుతో కూడా వైద్యసేవలు అందించేవారు. ఆయన మృతికి గ్రామస్తులు, ఆర్ఎంపీల సంఘ జిల్లా నాయకులు సంతాపం తెలిపారు.

వృద్ధురాలికి ఆర్థికసాయం


హజరాబికి ఆర్థికసాయం అందిస్తున్న సర్దార్ బాషా

ఒంగోలు అర్బన్: కుమారుడి ఆరోగ్యం సరిగాలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న వృద్ధురాలు హజారాబికి సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు సెక్రటరీ సర్దార్ బాషా సోమవారం రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. నరసరావుపేటలో ఉంటున్న వృద్ధురాలి దీనగాథ తెలుసుకున్న సర్దార్ బాషా.. ముస్లిం పెద్దల సమక్షంలో ఆర్థికసాయం అందించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల అధ్యక్షుడు నరశింగరావు


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయ కళాశాల అధ్యక్షుడు నరశింగరావు

కొత్తపట్నం: గ్రామీణ ప్రాంత ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకుంటే ఆర్థికంగా నష్టపోరని ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల అధ్యక్షుడు కె.నరశింగరావు అన్నారు. కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని కళా మందిర్‌లో ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ అడిషినల్ ఎస్పీ సుంకర సాయిబాబు అధ్యక్షత వహించగా, నరశింగరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉంటే స్వేచ్ఛగా జీవించవచ్చన్నారు. యువత సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను అరికట్టడానికి న్యాయవాదులు ఉచితంగా న్యాయ సేవలు అందించాలన్నారు. అందుకే ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో లీగల్ ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. సుంకర సాయిబాబు మాట్లాడుతూ తీర ప్రాంత ప్రజలకు చట్టాలపై అవగాహన తక్కువగా ఉంటుందన్నారు. కనీసం కొన్ని చట్టాలు తెలుసుకోవడానికి ఈ విజ్ఞాన సదస్సులు ఉపయోగపడతాయన్నారు. వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. ఇందిరా ప్రియదర్శిని కరస్పాండెంట్ వి.వి.రామకృష్ణారావు మాట్లాడుతూ 11 అంశాలతో కూడిన చట్టాల గురించి చర్చించడం ద్వారా అందరికీ అవగాహన కలుగుతుందని, మంచి కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మండలంలో ఎక్కువ మంది మత్స్యకారులు ఉన్నారని, ఉచిత న్యాయ సేవలు అందించడానికి అందరూ సహకరించాలని కోరారు. పలువురు న్యాయవిద్యార్థులు పలు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఇందిరా ప్రియదర్శిని ప్రిన్సిపాల్ కొతరపు నటరాజకుమార్, ఎంపీటీసీ సభ్యుడు రామలింగం వెంకట్రావు, గ్రామస్తులు, న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

- ప్రచారం నిర్వహించిన సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


ఉప్పుగుండూరు సచివాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

నాగులుప్పలపాడు: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కోరారు. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జగనన్న ఆశీసులతో పోటీలో ఉన్న శ్యాం ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి ముఖ్యమంత్రికి మనందరం అండగా నిలబడాలని కోరారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల ఓట్ల అభ్యర్థన కోసం సోమవారం మండలంలోని తక్కెళ్లపాడు, కొత్తకోట, నిడమానూరు, పోతవరం, కండ్లగుంట, ఒమ్మెవరం, ఉప్పుగుండూరు, మట్టిగుంట, ఈదుమూడి, ముప్పాళ్ల, తిమ్మసముద్రం గ్రామాల్లో ఎమ్మెల్యే సుధాకర్‌బాబు పర్యటించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓట్లు అభ్యర్థించారు. బీ నిడమానూరు గ్రామంలో పచ్చాకు అల్లుతున్న కూలీలతో ఎమ్మెల్యే కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాదల రత్నభారతి, వైఎస్సార్ సీపీ నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, ఇనగంటి పిచ్చిరెడ్డి, పోలవరపు శ్రీమన్నారాయణ, మారెడ్డి సుబ్బారెడ్డి, ఉప్పుగుండూరు వాసు పంతులు, డాకా కృష్ణారెడ్డి, పులిచర్ల పరంధామిరెడ్డి, వడ్డిముక్కల శ్రీను, మల్లెల జాన్సన్, కాట్రగడ్డ శ్రీను, గండు వెంకట్రావు, మాదాసు రాంబాబు, దేవరకొండ జయమ్మ, చిన్నం సురేష్, శీలం సురేష్, పల్లెర్ల అంజిరెడ్డి, పాలేరు నాగేశ్వరరావు, కూనం పూర్ణచంద్రరావు, కుమ్మరి సుధాకర్, బోలే వీరాంజనేయులు, వైకుంఠ వీరాంజనేయులు, కరణం రమేష్ తదితరులు పాల్గొన్నారు.


చీమకుర్తిలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్, జెడ్పీటీసీ, పట్టణ కన్వీనర్


సంతనూతలపాడులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, ఎంపీపీ, జెడ్పీటీసీ

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం...

చీమకుర్తి: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నెల 13న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున తూర్పురాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీ చంద్రశేఖరరెడ్డి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. వారి గెలుపు కోసం సోమవారం చీమకుర్తి పట్టణంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, పార్టీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. సంబంధిత కరపత్రాలు పంపిణీ చేశారు. రూరల్ ప్రాంతంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చంద్రపాడు, నేకునంబాద్, పల్లామల్లి, బండ్లమూడి, మంచికలపాడు గ్రామాల్లో పర్యటించి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

సంతనూతలపాడు మండలంలో...

వైఎస్సార్ సీపీ తరపున పోటీచేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సంతనూతలపాడులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సంతనూతలపాడు పట్టణంతో పాటు మైనంపాడు, చలప్పాలెం, రుద్రవరం, లక్ష్మీపురం, ఎండ్లూరు గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాలకు సంబంధించిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన డాక్టర్ యాదాల


సీఎం జగన్‌తో డాక్టర్ యాదాల

ఒంగోలు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదాల అశోక్‌బాబు సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌కు సంబంధించి సీఎం నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు. అనంతరం సీఎంను కలిసి ఆరోగ్యశ్రీ అమలుకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. తన పర్యటనలో వస్తున్న అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలకు సంబంధించిన అంశాలను, బిల్ పేమెంట్లకు సంబంధించిన అంశాలను తెలియజేశారు. మెడికల్ క్యాంపుల నిర్వహణకు సంబంధించి సీఎం అడిగిన ప్రశ్నకు పార్టీ పరంగా మెడికల్ క్యాంపులను రాష్ట్రవ్యాప్తంగా ఎలా నిర్వహిస్తున్నది వివరించారు. యాదాలను సీఎం అభినందించారు.

బాలినేని, టీజేఆర్‌ను కలిసిన నర్రా


బాలినేని, టీజేఆర్‌లను సన్మానిస్తున్న నర్రా

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమితులైన మండలంలోని పెదకొత్తపల్లి గ్రామానికి చెందిన నర్రా సురేష్‌బాబు ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, శ్రీమన్నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వీరాంజనేయస్వామి తిరునాళ్ళు


వీరాంజనేయస్వామి మూలవిరాట్


వీరాంజనేయస్వామి దేవస్థానం

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి 37వ వార్షిక తిరునాళ్లను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచే స్వామివారికి అభిషేకాలు, ఆకుపూజా కార్యక్రమాలతో పాటు పొంగళ్ల నివేదన జరుగుతుందని తెలిపారు. అనంతరం రాత్రికి భూకైలాస్ పూర్తి నాటకంతో పాటు సత్యహరిశ్చంద్ర కాటిసీను నాటకం ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. తిరునాళ్లకు పరిసర గ్రామాల నుంచి సుమారు 5 వేల మంది జనాభా రావచ్చని అంచనా వేయడంతో నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా ఏపీటీజీ నాయకుల ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న ఏపీటీజీ నాయకులు

ఒంగోలు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంచి మనిషి అయిన పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్‌కే చిన్నప్ప కోరారు. ఒంగోలులోని పలు ఎయిడెడ్ పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించి వాటిలో పనిచేస్తున్న ఉపాధ్యాయ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంపు విషయంలో సహకరించిన కాకర్ల వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి సూచనల మేరకు జిల్లాలోని 53 ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు చంద్రశేఖరరెడ్డికి అవకాశం కల్పించేందుకు ముందుకు రావాలన్నారు. చంద్రశేఖరరెడ్డిని గెలిపించుకోవడం ద్వారా కారుణ్య నియామకాలు, ఆరోగ్యకార్డులు పొందడం సులువవుతుందన్నారు. చంద్రశేఖరరెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీటీజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి, ఆర్థిక కార్యదర్శి కమ్మ రమేష్ పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు ఘన నివాళి



మాట్లాడుతున్న ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ

ఒంగోలు: గత 28 సంవత్సరాలుగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమంలో అశువులు బాసిన మాదిగ అమరవీరులకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక సభ్యుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను సాధించుకున్న రోజే వర్గీకరణ లక్ష్యసాధనలో ప్రాణాలర్పించిన మహనీయులకు మనమిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. 28 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తున్నా.. వర్గీకరణ వ్యతిరేకులు తమకు ఉన్న లాబీయింగ్ ద్వారా వర్గీకరణను అడ్డుకోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రత్యేక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఎంఆర్‌పీఎస్ నిర్మాణం మరింత బలంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగ మేధావులు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకులను కూడా ఉద్యమానికి మద్దతుగా బయటకు తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దీనికోసం మనందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పానుగంటి షాలేమ్‌రాజ్ సభాధ్యక్షత వహించగా, ప్రత్యేక ఆహ్వానితులుగా నేషనల్ మాదిగ రాజకీయ పోరాట సమితి అధ్యక్షుడు బీఎస్ రమేష్‌మాదిగ, ఎంఆర్‌పీఎస్ గుంటూరు జిల్లా నాయకుడు విజయ కుమార్ మాదిగ, కృష్ణా జిల్లా నాయకుడు శ్రీధర్ మాదిగ, అన్నమయ్య జిల్లా నాయకుడు బీవీ రమణ మాదిగ, నరసరావుపేటకు చెందిన ఆనంద్‌మాదిగ, పీటర్‌మాదిగ, బోసు మాదిగ, కోటి మాదిగ, ప్రకాశం జిల్లాకు చెందిన ఆలూరి చిరంజీవి మాదిగ, అనపర్తి ఆదాం మాదిగ, పి.చంద్రబోస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణపై అవగాహన పెంచుకోవాలి


విద్యార్థులకు సూచనలు చేస్తున్న రాజశేఖర్

కొత్తపట్నం: రైతులు సస్యరక్షణ పద్ధతులు, చీడపీడల నివారణపై అవగాహన పెంచుకోవాలని ఒంగోలు డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ సూచించారు. సోమవారం ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం ఒంగోలు ఆధ్వర్యంలో సస్యరక్షణ, చీడపీడల నివారణపై గ్రామీణ అవగాహన పని అనుభవ కార్యక్రమం నిర్వహించారు. అల్లూరు, కొత్తపట్నం గ్రామాల్లో గ్రామీణ అవగాహన పని అనుభవ కార్యక్రమం కింద తర్ఫీదు పొందుతున్న వ్యవసాయ విద్యార్థులను కలిసి కార్యక్రమ వివరాలను ఆయన తెలుసుకున్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో విద్యార్థుల కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కాలాల్లో వచ్చే పురుగులు, తెగుళ్లు, పోషక లోపాలను రైతులకు వివరించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ విద్యార్థులు ముఖ్య పంటల్లో వచ్చే పురుగులు, తెగుళ్లను గుర్తించి రైతులకు నివారణ పద్ధతులు తెలియజేయాలన్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులు పొందుతున్న సేవలను డాక్యుమెంట్ చేయాలని సూచించారు. రైతులకు ఏఏ విషయాలపై శిక్షణ అవసరమో ఇచ్చి పంట సాగులో మెళకువలు వివరించాలని చెప్పారు. కార్యక్రమానికి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ వరప్రసాద్‌రావు, డాక్టర్ జి.రమేష్, మండల వ్యవసాయాధికారి బి.వి మోహన్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగలక్ష్మి, శ్రావణ్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

రూ.10 వేల నగదు చోరీ

కొత్తపట్నం: పది వేల రూపాయల నగదు చోరీ జరగడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాల్లోకెళ్తే... మండలంలోని ఈతముక్కల గ్రామం సంజీవయ్య యానాదికాలనీకి చెందిన తిరువీధుల సురేష్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తుంటాడు. ప్రస్తుతం ఇంటి దగ్గరే ఉండి పనిచేస్తున్నాడు. ఈ నెల 3న తన భార్య స్వాతితో కలిసి ఆఫీస్ పనిమీద హైదరాబాద్ వెళ్లాడు. సోమవారం లైట్లు వేసి ఉండటంతో సురేష్ బావ ఈగ శ్రీనివాసరావు ఇంటి వద్దకు వెళ్లి చూడగా, తలుపులు ఇంట్లోని బీరువా పగలకొట్టి ఉన్నాయి. బీరువాలోని రూ.10 వేల నగదు పోయినట్లు గుర్తించారు. ఆ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సురేష్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొక్కిలగడ్డ మధుసూదన్‌రావు తెలిపారు.

ఈకేవైసీ చేయించుకున్న రైతులకు రసీదులివ్వాలి


ఏడుగుండ్లపాడు ఆర్‌బీకేలో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో రమేష్, వీఏఏ అవినాష్

మద్దిపాడు: మండలంలో ఈకేవైసీ చేయించుకున్న ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని మండల వ్యవసాయశాఖ అధికారి కె.రమేష్ సూచించారు. సోమవారం మండలంలోని మద్దిపాడు, దొడ్డవరప్పాడు, ఏడుగుండ్లపాడు ఆర్‌బీకేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో శనగ పంట కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు పంటను అమ్ముకోవడానికి ఈకేవైసీ రసీదులు ఉపయోగపడతాయన్నారు. ఈకేవైసీ చేయించుకోని వారు ఎవరైనా ఉంటే ఎందుకు చేయించలేదనే కారణాలను రిమార్క్‌లో రాయాలని వీఏఏలను ఆదేశించారు. రైతుల లిస్టును ఆర్‌బీకేల వద్ద, గ్రామ సచివాలయం వద్ద ప్రదర్శించాలన్నారు. సోషల్ ఆడిట్ జరగనున్న నేపథ్యంలో ప్రతి వీఏఏ ఫొటోలను అప్‌లోడు చేసి ఉంచాలని తెలిపారు. ఆర్‌బీకేలలో రికార్డులు పరిశీలించి వాటి నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట వీఏఏలు రేణుక, ప్రసన్న, అవినాష్ తదితరులు ఉన్నారు.

స్త్రీ, పురుషుల సమానత్వం కోసం ఉద్యమించాలి


మద్దులూరులో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రగతిశీల మహిళా సంఘ లీడర్లు

చీమకుర్తి: స్త్రీ, పురుషుల సమానత్వం కోసం మహిళా లోకం ఉద్యమించాలని ప్రగతిశీల మహిళా సంఘ జిల్లా అధ్యక్షురాలు ఎస్.భారతి పిలుపునిచ్చారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు మహిళల అభ్యున్నతిని కాంక్షిస్తూ సెమినార్లు, సదస్సులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అందులో భాగంగా సోమవారం సంతనూతలపాడు మండలం మద్దులూరు గ్రామంలో స్థానిక మహిళలను చైతన్యం చేస్తూ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఆదిమ సమాజం నుంచి ఆధునిక సమాజం వరకు మహిళలు ద్వితీయ శ్రేణి పౌరులుగానే జీవిస్తున్నారన్నారు. మహిళలు పనిచేసే ప్రతి రంగంలోనూ చులకనగా చూస్తూ వారికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వై.సుశీల, శ్రీదేవి, మాధవి, సౌజన్యం, నాగమ్మ, స్థానికులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం ఎంతో కీలకం

- 3కే వాక్‌ను ప్రారంభించిన బాలినేని శచీదేవి, శిద్దా లక్ష్మీపద్మావతి



3కే వాక్‌ను ప్రారంభించి మహిళలతో కలిసి నడుస్తున్న బాలినేని శచీదేవి, శిద్దా లక్ష్మీపద్మావతి

ఒంగోలు అర్బన్: మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ ఇంట్లో అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చని, తద్వారా సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి, వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీపద్మావతి పేర్కొన్నారు. సోమవారం ఉపాస్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ సహకారంతో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 3కే వాక్‌తో పాటు ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శచీదేవి, లక్ష్మీపద్మావతి హాజరై జెండా ఊపి వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శచీదేవి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి బాలికలు, మహిళలు ఆరోగ్యంపై ముందస్తు జాగ్రత్తలు వహించాలన్నారు. శారీరక దారుఢ్యంతో పాటు మానసిక పటిష్టత మహిళలకు ఎంతో ముఖ్యమన్నారు. అన్ని రంగాల్లో ఎంతో ఉన్నత స్థానాల్లో మహిళలు ఉన్నారని, వారి స్ఫూర్తితో విద్యార్థినులు రాణించాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు భవిష్యత్తుపై పక్కా ప్రణాళికతో ఎదిగి పదిమందికి ఆదర్శప్రాయంగా ఉండేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మలినేని ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ జయలక్ష్మి, ఉపాస్ ఆస్పత్రి డైరెక్టర్లు డాక్టర్ ఉమాపతి, ప్రకాష్ చవల, అనిల్, అనపర్తి శ్రీనివాస్, జ్యోత్స్న మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాస్‌లో మహిళలకు ఉచిత ఓపీతో పాటు అన్ని వైద్య సేవల్లో 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాస్ వైద్యులు జి.శ్రీనివాస్, పవన్, పోకూరి శ్రీనివాస్, యు.శ్రీనివాస్, కృష్ణ, యజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు

ఒంగోలు సబర్బన్: మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు, డీఆర్పీలు, సీసీలకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని మెప్మా కార్యాలయ ప్రాంగణంలో మెప్మా పీడీ తేళ్ల రవికుమార్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు క్రీడలు, ఆటల పోటీలు, స్పూన్ లెమన్ పోటీలు, తాడాట, నడక, పాటల పోటీలు నిర్వహించారు.


పోటీల్లో పాల్గొన్న డ్వాక్రా గ్రూపుల మహిళలు


జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న మెప్మా పీడీ రవికుమార్, డీసీహెచ్ కొండయ్య

పురాతన అరుదైన నాణేలు, కరెన్సీ ప్రదర్శన


ప్రదర్శనలో ఉంచిన నాణేలు

స్వర్ణ(కారంచేడు): బ్రిటీష్–ఇండియా కాలంతో పాటు, పురాతన అరుదైన నాణేలతో పాటు, ఎన్నో ఏళ్ల నాటి నోట్లను స్వర్ణ ఉన్నత పాఠశాలలో ప్రదర్శించారు. సోమవారం మండలంలోని స్వర్ణ హైస్కూల్ ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ముందు ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని ఆదిపూడి గ్రామానికి చెందిన కాల్వ రఘురామ్ తనకు చిన్నతనం నుంచి నాణెములు, నోట్లను సేకరించడం అలవాటుగా మారింది. దీంతో ఆయన పాతకాలం నాటి అర్ధణా, అణా, బేడల దగ్గర నుంచి పైసా, రెండు, మూడు, ఐదు పైసల బిళ్లలను ఆయన ప్రదర్శనగా ఉంచారు. నోట్లలో పాత తరం రూపాయిలు రద్దు అయిన రూ 500, 1000ల నోట్ల వరకు ఈ ప్రదర్శనలో ఉంచారు. దీంతో అనేక మంది ఉపాధ్యాయులు సైతం వీటిని ఆసక్తిగా తిలకించారు. ఇక విద్యార్థులయితే వాటిని చూసి వాటిని తాకాలని పోటీపడ్డారు. అరుదైన ఈ నాణేలు, నోట్లను మా పాఠశాలలో ఉచితంగా ప్రదర్శించిన రఘురామ్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.